
కొనసాగుతున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ



కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో నిర్వహిస్తున్న అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ మూడోరోజు మంగళవారం ఉత్సాహంగా కొనసాగింది. ఎంపికల ప్రక్రియలో రిజిస్ట్రేషన్ మొదలు పరుగు పందెం, లాంగ్‌జంప్, హైజంప్, పుల్లప్స్, జిగ్‌జాగ్ బ్యాలన్స్ తదితర క్రీడాంశాల్లో అభ్యర్థుల ప్రతిభను పరీక్షించారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్ డైరెక్టర్ కల్నల్ పునీత్‌కుమార్ ఎంపికలను పర్యవేక్షించారు. -కడప స్పోర్ట్స్

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.230	రూ.290
రెండోరకం	రూ.140	రూ.220

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 188 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

వైఎస్ జగన్‌ను కలిసిన కొరముట్ల



వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా తనను నియమించినందుకు రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. తాడేపల్లిలో ఆయనను కలిసిన కొరముట్ల పుష్పగుచ్ఛం అందించి తనకు ఇచ్చిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని తెలిపారు.

జాతీయ కబడ్డీ పోటీలకు నాగిరెడ్డిపల్లి విద్యార్థి



సయ్యద్ ఉమర్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీఈటీ

నందలూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదవ తరగతి విద్యార్థి సయ్యద్ ఉమర్ ఉస్మాన్ అలీ కబడ్డీ పోటీలలో జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. సోమవారం బాపట్లలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో సయ్యద్ ఉమర్ ప్రతిభ చాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. మంగళవారం ఆ విద్యార్థిని పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలు గౌరీ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలలిత కుమారి, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

ఆసుపత్రులు నిబంధనలు పాటించాల్సిందే



మాట్లాడుతున్న డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ కొండయ్య

రాయచోటి అర్బన్: జిల్లాలోని అన్ని ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలను పాటించాల్సిందేనని డీఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ కొండయ్య అన్నారు. మంగళవారం సాయంత్రం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో ఏవైనా యాజమాన్యాలు నిబంధనలు ఉల్లంఘించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రులు, క్లినిక్‌లు ఏర్పాటు చేసే స్థలాల పత్రాలను, మున్సిపాలిటీ నుంచి ట్రేడ్ లైసెన్స్, బిల్డింగ్‌ప్లాన్ తదితరాలు పీడీఎఫ్ రూపంలో జతపరచాలన్నారు. రెన్యువల్ గడువు ముగిసే రెండు నెలల ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పదిలో ఉత్తమ ఫలితాలకు కృషి



హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి జయప్రకాష్

లక్కిరెడ్డిపల్లి: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు హెచ్‌డబ్ల్యూఓలు కృషి చేయాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి జయప్రకాష్ పేర్కొన్నారు. మంగళవారం ఎస్సీ బాలుర హాస్టల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం ఇవ్వాలన్నారు. ఎస్సీ-వన్, టు వసతి గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, వీటిని త్వరలో అద్దెభవనంలోకి మారుస్తామన్నారు. విద్యార్థులకోసం ప్రత్యేక ట్యూటర్లు ఏర్పాటు చేశామని, ప్రత్యేక తరగతులు నిర్వహించి మెరుగైన ఫలితాల కోసం కృషి చేయాలన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. జిల్లాలో నాడు-నేడు కింద 24 వసతి గృహాలు మంజూరయ్యాయని, నిధులు లేక ఆగిపోయాయని ఆయన అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం నిధులు ఇస్తే వసతి గృహాలకు మరమ్మతులు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓలు రమేష్ బాబు, శ్రీనివాసులు, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా.. పనులు సాగేనా?

- కేటాయింపు రూ.812 కోట్లు
- అప్పులు రూ.500 కోట్లు!
- ఇందులో కాలువలకు రూ.612 కోట్లు, రిజర్వాయర్లకు రూ.200 కోట్లతో పనులు
- ఈ నిధులతో బిల్లులు చెల్లిస్తారా.. పనులు చేయిస్తారా
- హంద్రీ-నీవా ఫేజ్-2 పూర్తికి రూ.629 కోట్లు అవసరం
- పీబీసీ లైనింగ్‌కు అదనంగా రూ.473 కోట్లు కావాలి
- ప్రధాన కాలువ పనులకు నిధులు వెచ్చించాలి
- వచ్చే నాలుగు నెలల్లో పనులు సాగడం ప్రశ్నార్థకమే



లైనింగ్ పనులు జరగనున్న పుంగనూరు ఉప కాలువ

బి.కొత్తకోట: బడ్జెట్‌లో హంద్రీ-నీవా ప్రాజెక్టుకు చేసిన కేటాయింపులతో ఈ ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుందన్న ప్రశ్న తలెత్తుతోంది. రెండు దశల్లో చేపట్టిన ఈ సాగు, తాగునీటి ప్రాజెక్టుకు టీడీపీ ప్రభుత్వాల్లో ప్రతి బడ్జెట్‌లోనూ నిరాదరణకు గురవుతోంది. 2023-24 తాజా బడ్జెట్‌లో అదే పునరావృతమైంది. ఇప్పటికే జరిగిన పనులకు కాంట్రాక్టర్లకు రూ.500 కోట్లకుపైనే బిల్లులు చెల్లించాల్సి ఉండగా బడ్జెట్ కేటాయింపు మాత్రం మొక్కుబడిగా రూ.812 కోట్లే. ఈ నిధులతో ప్రాజెక్టు పనులు ముందుకు సాగాలా, బిల్లులు చెల్లిస్తారా అన్నది చర్చ. దీనితో ప్రాజెక్టు పనులు ఎలా ముందుకు తీసుకెళ్తారన్నది ప్రశ్నార్థకం. 2006లో అప్పటి సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన ఈ ప్రాజెక్టుకు ఇబ్బడి ముబ్బడిగా నిధులివ్వగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో రాయలసీమ ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చింది. ఇప్పుడు టీడీపీ కూటమి ప్రభుత్వంలో ఈ ప్రాజెక్టుకు నిధుల కష్టం వచ్చింది.

రూ.812 కోట్లతో పనులెలా..

బడ్జెట్‌లో హంద్రీ - నీవాకు రూ.812 కోట్లు కేటాయించారు. ఈ నిధులను ప్రాజెక్టు రెండు దశలకు సంబంధించిన పనులకు వినియోగించుకోవాలి. ఈ నిధుల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించిన పుంగనూరు ఉప కాలువకు లైనింగ్ పనులకు రూ.473 కోట్లు, ఉమ్మడి అనంతపురం జిల్లాలో జరిగే కాలువ పనులకు రూ.139 కోట్లు, రిజర్వాయర్లకు రూ.200 కోట్లు కేటాయించారు. ఈ మూడు పనులకు నిధులిచ్చిన ప్రభుత్వం పెండింగ్ పనులపై దృష్టి పెట్టలేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రధాన కాలువ విస్తరణ పనులు చేపడుతున్నారు. దీనికి నిధులు భారీగా ఖర్చు చేయాల్సివున్నప్పటికీ కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వలేదు. రెండు దశల ప్రాజెక్టుకు నిధుల సమస్య పట్టిపీడించనుంది.

- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో హంద్రీ-నీవా ప్రాజెక్టును పూర్తి చేయాలంటే రూ.629 కోట్లు అవసరం. ప్రాజెక్టులో భాగమైన పెండింగ్‌లోని ఉప కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, స్ట్రక్చర్స్ పూర్తి చేయాల్సివుంది. ప్రధాన కాలువపై చిన్నమండెం మండలం పడమటికోన వద్ద 700 మీటర్ల కాలువ పనులకు రూ.150 కోట్లు, కలకడ వద్ద 500 మీటర్ల కాలువ తవ్వకం, 12 చోట్ల స్ట్రక్చర్స్ నిర్మిస్తే పెండింగ్ పనులు చేయాల్సి ఉంది.

▸▸ విస్తరణ లేదు లైనింగే..

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సాగే పుంగనూరు ఉప కాలువ విస్తరణ పనులకు ప్రభుత్వం మంగళం పాడింది. సీఎం వైఎస్.జగన్ హయాంలో 2022లో రూ.1,217 కోట్లతో విస్తరణ పనిని చేపట్టారు. కృష్ణా జలాలు పుష్కలంగా తరలించుకునేలా 1,180 క్యూసెక్కుల నీటి ప్రవాహంతో పనులు చేపట్టగా.. ఈ ప్రభుత్వం నిలిపివేయించింది. బడ్జెట్‌లో ఈ కాలువ లైనింగ్ పనులకు రూ.473 కోట్లు కేటాయించింది. ఎంతో ప్రయోజనకరమైన విస్తరణ పనులు నిలిపివేయడం రైతులకు తీరని నష్టం కలిగించనుంది. ప్రస్తుతం కాలువకు లైనింగ్ పనులు ప్రారంభించనున్నారు.

అప్పులే రూ.500 కోట్లు

ప్రాజెక్టు పనులకు సంబంధించి ఉమ్మడి చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో ఇప్పటికే జరిగిన పనులకు కాంట్రాక్టర్లకు రూ.500 కోట్లకుపైనే బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి చెల్లింపుల కోసం కాంట్రాక్టర్లు ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పుంగనూరు ఉపకాలువ పనులకు రూ.117 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రూ.400 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుత జరిగిన నిధుల కేటాయింపులను బిల్లుల చెల్లింపునకు వినియోగిస్తారా పనులు చేపడతారా అన్నది ప్రశ్నార్థకం.

▸▸ నాలుగు నెలల్లో ఏం చేస్తారు..

వచ్చే మార్చి నాటికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. కేవలం నాలుగు నెలల కోసం పెట్టిన బడ్జెట్ నిధులు సద్వినియోగం చేసుకోవడం మాటెలా ఉన్నా..బిల్లులు చెల్లించాలి. లేదంటే పనులు ముందుకు సాగడం లేదా, కొత్త పనులు మొదలు పెట్టడం సులువు కాదు. కేటాయించిన నిధులు ఏ మూలకు సరిపోవు. ఈ పరిస్థితుల్లో హంద్రీ- నీవా ప్రాజెక్టు పనుల్లో పురోగతి అనుమానమే. నిధులు లేకుండా ప్రాజెక్టు పూర్తి కావడమన్నది భేతాళుడి ప్రశ్నే.

అక్రమాల ఆధార్ సెంటర్‌లో తనిఖీ



ఆధార్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

రాజంపేట: రాజంపేట పట్టణంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సమీపంలో ఉన్న అక్రమాల ఆధార్ సెంటర్‌లో పోలీసులు, రెవిన్యూ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. గత శనివారం సాక్షిలో 'అక్రమాల ఆధార్ కేంద్రం గుట్టురట్టు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. రెవిన్యూ, పోలీసు అధికారులు వారం రోజులుగా మూతపడిన ఆ కేంద్రం తాళాలు పగులగొట్టి తెరిచారు. పంచనామా నిర్వహించారు. తహసీల్దారు మున్నీ, ఆర్ఐ శేషంరాజు, ఎస్ఐ నాగేశ్వరరావు, వీఆర్వో రాజు, టౌన్ ఏఎస్ఐ వర్మ తదితరులు ఆధార్ కేంద్రంలో పరిశీలించారు. దొడ్డిదారిలో ఆధార్ కార్డులు సృష్టించేందుకు కారణమైన ఆధారాల గురించి, సెంటర్ నిర్వహణ తీరును క్షుణ్ణంగా తెలుసుకున్నారు. కాగా చాలా మంది వద్ద నిర్వాహకుడు ఆధార్ సర్టిఫికెట్ కోసం వేలాది రూపాయిలు వసూలు చేసిన సంగతి తెలిసిందే. పరారీలో ఉన్న ఆధార్ సెంటర్ నిర్వాహకుడిపై రెవిన్యూ, పోలీసుశాఖ ఏటువంటి చర్య తీసుకుంటుందో వేచిచూడాలి.

ముగ్గురు ఎమ్మెల్యేలకు విప్‌లుగా అవకాశం

కడప రూరల్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేలకు అసెంబ్లీలో ప్రభుత్వ విప్‌లుగా అవకాశం లభించింది. అసెంబ్లీలో మొత్తం 15 మంది విప్‌లకు గాను ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో టీడీపీ నుంచి కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి, బీజేపీ నుంచి జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, జనసేన నుంచి రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌లకు అసెంబ్లీలో ప్రభుత్వ విప్‌లుగా అవకాశం లభించింది.

ఉరుసుకు పకడ్బందీ ఏర్పాట్లు

రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి హర్షవర్ధన్



మాట్లాడుతున్న రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి హర్షవర్ధన్

కడప సెవెన్‌రోడ్స్: కడప పెద్దదర్గా (అమీన్ పీర్) ఉరుసు మహోత్సవాల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి హర్షవర్ధన్ దర్గా ఉత్సవ కమిటీ సభ్యులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఉరుసు నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టర్ శ్రీధర్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. రెవెన్యూతోపాటు సంబంధిత శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉరుసు మహోత్సవాల్లో భాగంగా 16, 17వ తేదీల్లో జరిగే గంధం, ఉరుసు ఉత్సవ ఘట్టాలకు లక్షలాది మంది భక్తులు, వీఐపీలు హాజరవుతారన్నారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఉరుసు మహోత్సవాన్ని జరిపించడంలో పోలీసు శాఖ అన్ని రకాల భద్రత చర్యలను చేపట్టిందన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రూట్ మ్యాపింగ్ చేసి సిబ్బందికి డ్యూటీలు కేటాయించినట్లు వెల్లడించారు. ఉరుసు సందర్భంగా ముఖ్యమైన ఐదు రోజులపాటు రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, దర్గా వరకు నగరంలోని అన్ని రూట్లను కవర్ చేస్తూ నిరంతరాయంగా బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ యాజమాన్యాన్ని ఆదేశించారు. ఉత్సవాల్లో భాగంగా దర్గా, వాణిజ్య సముదాయాలకు విద్యుత్ దీపాలంకరణలో ఎక్కడా కూడా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా నిరంతర పర్యవేక్షణ జరగాలన్నారు. వీఐపీలు, ప్రొటోకాల్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. కడప నగరంలో జరిగే అతిపెద్ద మహోత్సవాన్ని ప్రపంచం వీక్షించేలా.. సమాచార పౌర సంబంధాల శాఖ, మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయాలన్నారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పరిశుభ్రత ఏర్పాట్లను చూడాలన్నారు.

లక్ష్యసాధనకు కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి: ప్రభుత్వ ఆశయాలు, సిద్ధాంతాల లక్ష్య సాధనలో అన్నిశాఖల అధికారులు బాధ్యతాయుతంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. వ్యవసాయం, పశు సంవర్థక, హార్టికల్చర్, సెరికల్చర్, మత్స్య, అటవీ, మైనింగ్, జలవనరులు, పరిశ్రమలు, ఏపీఐఐసీ, ఏపీఎస్‌పీడీసీఎల్, రోడ్లు అండ్ భవనాలు, హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్, పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య, ఉన్నత విద్య తదితర శాఖల లక్ష్యాలు, సాధించిన ప్రగతి, వంద రోజుల ప్రణాళిక, విజన్ 2047 ప్రణాళికలో భాగంగా నిర్దేశించుకున్న ఆయా అంశాలలో తీసుకున్న, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షించారు. చేపట్టాల్సిన కార్యాచరణపై దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సిపిఐ వెంకట పెద్దయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్


నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు

ఓబులవారిపల్లె: ప్రజల సమస్యలు సత్వరం పరిష్కరించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ఆయన మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన సమస్యలు క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కారం చేయాలని సూచించారు. అపార్ ఐడీ కార్డులు ఆన్‌లైన్ చేయడంలో మండలం వెనుకబడి ఉందని, ఎందుకు నమోదు చేయలేదని అధికారులను ప్రశ్నించారు. వెంటనే విద్యార్థుల అపార్ ఐడీ కార్డులు ఆన్‌లైన్ త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులందరూ కృషి చేయాలన్నారు. హౌసింగ్ సంబంధించి చాలా వెనుకబడి ఉన్నారని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే నోటీసులు జారీ చేస్తామన్నారు. రెవెన్యూ సమస్యలు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీధర్ రావు, ఎంపీడీఓ మల్ రెడ్డి, ఎంఈఓ రెడ్డయ్య, అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో కలెక్టర్ సమీక్ష

పుల్లంపేట: పుల్లంపేటలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. మండలంలోని రెవెన్యూ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, హౌసింగ్, ఉపాధి హామీ, విద్యుత్, ఇరిగేషన్, వెటర్నరీ వైద్యులతో సమావేశం నిర్వహించారు. అధికారులందరూ కలిసికట్టుగా పనిచేసి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. భూ సమస్యలు, హౌసింగ్ తదితర అంశాలపై చర్చించారు. అనంతరం దేవసముద్రం గ్రామంలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అరవిందకిషోర్, ఎంపీడీఓ జయశ్రీ, అధికారులు పాల్గొన్నారు.

పట్టు జారింది



- కొండెక్కిన పట్టుపరిశ్రమశాఖ ప్రోత్సాహకాలు
- ఇన్సెంటివ్ బకాయిలు రూ.కోటికిపైగానే
- ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువు
- సెరికల్చర్ హబ్ చేస్తామని గతంలో కిరణ్ సర్కారు, ప్రస్తుత సీఎం చంద్రబాబు హామీలు



తంబళ్లపల్లె వద్ద మూతపడిన సెరికల్చర్ షెడ్డు

మదనపల్లె సిటీ: పట్టు పరిశ్రమపై ఆధారపడిన రైతులు పట్టు కోల్పోతున్నారు. ప్రభుత్వం నుంచి తగిన సహకారం లేక.. ప్రోత్సాహకాలు అందక... ధరలు పరిస్థితి ఎలా ఉంటుందో తెలియక... రైతులకు ఇవ్వాల్సిన ఇన్సెంటివ్ బకాయిలు అందకపోవడంతో సెరికల్చర్ వ్యవస్థ ఉనికే ప్రశ్నార్థకం అవుతోంది. మరోవైపు రీలర్లకు ఇబ్బందులు తప్పడం లేదు. పొరుగునే ఉన్న కర్ణాటక రాష్ట్రంలో సిల్క్ పరిశ్రమ కళకళలాడుతోంది. గతంలో కిరణ్ కుమార్‌రెడ్డి సర్కారు, ప్రస్తుత సీఎం చంద్రబాబు జిల్లాను సెరికల్చర్ హబ్ చేస్తామన్న మాటలు నీటి మూటలుగానే మిగిలాయి. ఫలితంగా జిల్లాలో మల్బరీ విస్తీర్ణం తగ్గుముఖం పడుతోంది.

- జిల్లాలో పట్టురైతులకు ప్రోత్సాహం అందక.. నాణ్యత లేని సిల్క్ తయారీతో ధరలు పడిపోతున్నాయి. దానికి తోడు ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రోత్సాహకాలు, పథకాలు సక్రమంగా అమలు కాక సెరికల్చర్‌పై ఆధారపడిన రైతులపై తీవ్ర ప్రభావం పడుతోంది. జిల్లాలో 12,839 ఎకరాల్లో మల్బరీ సాగవుతోంది. ప్రస్తుతం మదనపల్లె డివిజన్ పరిధిలో 15 మండలాలలో 10 వేల ఎకరాలు సాగు అవుతుండగా ప్రస్తుతం 7 వేలకు పడిపోయింది. సుమారు 3 వేల మంది రైతులు మల్బరీ సాగు వదిలేశారు. అయితే టమటా సాగుపై రైతులు ఎక్కువ మొగ్గు చూపుతున్నారు.

ఇన్సెంటివ్ బకాయిలు రూ. కోటికిపైగానే...!

పట్టురైతులకు ప్రోత్సాహకంగా కిలో గూళ్లకు ప్రభుత్వం రూ.50 అందజేస్తోంది. ఇప్పటిదాకా మదనపల్లె డివిజన్ పరిధిలో రూ.కోటికిపైగానే ఇన్సెంటివ్ బకాయిలు రావాల్సి ఉంది. దీనిపై రైతులు పోరాడుతూనే ఉన్నారు.

▸▸ అందని ప్రోత్సాహకాలు

గతంలో రైతులు మల్బరీ తోటను సాగు చేయడానికి ప్లాంటేషన్‌కు 75 శాతం రాయితీతో రూ.6750 అందేది. రేరింగ్ షెడ్డుకు యూనిట్ ధర రూ.3 లక్షలు అందించేవారు. చాకీ సెంటర్ నిర్వాహకులకు రాయితీ వచ్చేది. ప్లాస్టిక్ నేత్రికలను సైతం రైతులకు పంపిణీ చేసేవారు. సిల్క్ ఇండస్ట్రియల్‌కు సంబంధించి 50 శాతం సబ్సిడీ రీలింగ్ యూనిట్లకు అందించేవారు. కానీ ఇవన్నీ గతం. ఇప్పుడు ఈ పథకాలు ఉన్నప్పటికీ అమలు కష్టమైంది.



మల్బరీతోట

▸▸ మార్కెట్‌కు రాని గూళ్లు



మదనపల్లె పట్టు గూళ్ల మార్కెట్ బోసిపోతోంది. గత మూడు నెలల నుంచి నెలలో నాలుగైదు రోజులు మాత్రమే గూళ్లు వస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా మార్కెట్ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. గతంలో రోజు వెయ్యి క్వింటాళ్లు వచ్చే మార్కెట్‌కు ప్రస్తుతం కిలోలకే పరిమితమైంది.ధరలు కూడా అంత మాత్రమే. ఈనెలలో ఇప్పటి వరకు ఏడు రోజులు మార్కెట్‌కు పట్టుగూళ్లే రాలేదు. దీనిని బట్టి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

సెరికల్చర్ హబ్ ఉత్తి మాటలే...!

జిల్లాను ప్రపంచ స్థాయి సెరికల్చర్ హబ్‌గా చేస్తానని గతంలో కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం, ఆపై చంద్రబాబు మాటిచ్చారు. ఇటీవల ఎన్నికల ప్రచారంలో సెరికల్చర్ హబ్ చేస్తానని చెప్పారు. తరువాత పట్టించుకున్న పాపాన పోలేదు.

అవగాహన సదస్సులు



రైతులు మల్బరీ సాగు చేసేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మల్బరీ సాగు వల్ల కలిగే లాభాలు, ప్రోత్సాహకాలు గురించి తెలియజేస్తున్నాం. ఇప్పటికే రామసముద్రం, తంబళ్లపల్లె మండలాల్లో రైతులకు అవగాహన కల్పించాం. మార్కెట్‌కు పట్టుగూళ్లు తెచ్చే విధంగా చర్యలు చేపట్టాం. ఇన్సెంటివ్ త్వరలో అందుతుంది.

– రామమోహన్, ఏడీ, సెరికల్చర్, మదనపల్లె

రైల్వే కార్మికుల హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వం

- దక్షిణ మ ధ్యరైల్వే మజ్దూర్ యూనియన్ నేత శంకర్‌రావు



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న దక్షిణ మధ్య రైల్వే జోనల్ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు

రాజంపేట: భారతీయ రైల్వేలో కార్మికుల హక్కులను కాలరాసేందుకు బీజేపీ ప్రభుత్వం తమకు అనుకూలంగా మార్పులు చేసుకుంటూ ముందుకు పోతోందని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ శంకర్‌రావు విమర్శించారు. జిల్లాలోని రాజంపేట, నందలూరు, రైల్వే కోడూరుతో పాటు పలు రైల్వేస్టేషన్‌లో గుర్తింపు ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం చర్యలకు అడ్డుకట్ట వేసేందుకు జాతీయ స్థాయిలో ఒకే యూనియన్ ఉండి పోరాటం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఆ శక్తిని కార్మికులు ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్, సౌత్ సెంట్రల్ మజ్దూర్ యూనియన్‌కు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గుంతకల్ డివిజన్ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, డివిజనల్ అధ్యక్షుడు సుదర్శన్, నందలూరు బ్రాంచి చైర్మన్ గోపీనాథ్, సెక్రటరీ విశ్వనాథ్, అసిస్టెంట్ సెక్రటరీ ఎస్ఎం బాషా, మాజీ సెక్రటరీ కమలాకర్, నాయకులు సుధీర్, సిద్దయ్య, శివకుమార్‌రాజు, నిచయ్‌కుమార్ సిన్హా, మణి, పీరయ్య తదితరులు పాల్గొన్నారు.